ప్యూర్ వాటర్



ప్యూరిఫై పేరుతో.. ప్రాణాలతో చెలగాటం

- శుద్ధ జలాల మాటున నీటిలో గరళం
- అనుమతులేని వాటర్ ప్లాంట్లే అధికం
- నిబంధనలు పాటించకుండా నీటి వ్యాపారం
- ఐఎస్ఐ మార్కు, లైసెన్సు లేని వాటర్ ఫిల్టర్లు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతుండగా.. ఇదే అదనుగా శుద్ధ జలాల పేరుతో కొందరు నీటి వ్యాపారం చేస్తున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విచ్చలవిడిగా ప్లాంట్లు ఏర్పాటైనా.. ఒక్క చోటా కనీస నిబంధనలు పాటించడం లేదు. జిల్లాలో 700 పైగా శుద్ధ జలాల ప్లాంట్లు ఉండగా, ఇందులో అన్ని అనుమతులతో కొనసాగుతున్న ప్లాంట్లు దాదాపు 250 వరకు మాత్రమే ఉన్నట్లు భూగర్భ జల వనరుల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే నీటిని నిబంధనలకు అనుగుణంగా శుద్ధి చేయకుండానే విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పెరిగిన నీటి వ్యాపారం..

గతంలో నగర శివారుల్లో వేళ్ల మీద లెక్క పెట్టే సంఖ్యలో ఉండే తాగునీటి శుద్ధి చేసే ప్లాంట్లు నేడు పురపాలక సంఘాలతో సహా గ్రామ పంచాయతీలు, జీహెచ్ఎంసీ పరిధిలోని బస్తీలు, డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో ప్రతిచోటా వెలిశాయి. వేసవి కాలం, పెళ్లిళ్లు ఇతర శుభ కార్యాలయాలు, హోటళ్లు, బార్లు, వైన్‌షాపులు, ఇతర వ్యాపార సముదాయాలను కలుపుకుంటే వేల సంఖ్యలో క్యాన్ల విక్రయాలు జరుగుతున్నాయి. అలాగే, అపార్టుమెంట్లు, కాలనీలు, బస్తీల్లో కూడా క్యాన్ల విక్రయాలు జోరు అధికంగా ఉంది. ప్లాంటు దగ్గరికే వెళ్లి తీసుకుంటే ఒక్కో క్యానుకు రూ.10 తీసుకుంటున్నారు. ఇళ్లు, వ్యాపార వాణిజ్య కేంద్రాలకు క్యాన్లు సరఫరా చేస్తే దూరాన్ని బట్టి ఒక్కో క్యానుకు రూ.15 నుంచి రూ.20 తీసుకుంటున్నారు.

నిబంధనలు ఇవి..

వాటర్ ప్లాంటు ఏర్పాటుకు బీఎస్ఐ అనుమతి ఉండాలి. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్లాంటులో విశాలమైన హాలు ఉండాలి. వెలుతురు, గాలి ఉండాలి. టైల్స్, గ్రానైట్ గచ్చు ఉండాలి. స్టీల్, హెచ్‌డీపీ పైపులైన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్ఐ మార్కు కలిగిన ఫిల్టర్ యంత్రాలు వాడాలి. నీటి ట్యాంకులు, ఇతర సామగ్రి, నాణ్యమైనవి వాడాలి. పురపాలక సంఘం లేదా గ్రామ పంచాయతీ నుంచి ట్రేడ్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

నియంత్రణ లేక..

మిషన్ భగీరథ పథకం రానప్పుడు ఎక్కడైతే తాగడానికి పనికిరాని నీరుందని సమాచారం వస్తే అక్కడ నీటి పరీక్ష జరిపి ఆర్వో ప్లాంట్లకు అనుమతి ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితితో పాటు నియంత్రణ లేకపోవడంతో ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు ఇష్టమొచ్చిన రీతిలో ప్లాంట్లను విస్తరిస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ప్యూరిఫై వాటర్ ప్లాంట్ల నియంత్రణపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని జామామజీద్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్లు భిక్షపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నేతలు కొండల్‌రెడ్డి, అన్నూబాయ్, ఖలీల్ ముస్లింలు పాల్గొన్నారు.

నీటి వృథా లేకుండా చూడాలి

మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ



హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఫిర్యాదు స్వీకరిస్తున్న కమిషనర్ సాబేర్ అలీ

ఘట్‌కేసర్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు హెల్ప్‌లైన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రస్తుతం నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందని, నీటి వృథాను అరికట్టాలన్నారు. నీటి సరఫరాపై అంతరాయం ఏర్పడితే టోల్ ఫ్రీ నంబర్ 18004257578 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓ గీతకు వినతి అందజేస్తున్న జయచంద్ర, ఈశ్వర్

ఘట్‌కేసర్: కాచవాని సింగారం మహేశ్వరీ నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ నాయకులు సోమవారం ఎంపీడీఓ గీతకు వినతి అందజేశారు. మహేశ్వరీనగర్‌లో నీటి సమస్య పరిష్కరించాలని జిల్లా అధికారుల ఆదేశాలు బుట్టదాఖలు చేశారని లేఖలో తెలిపారు. గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నీరు ఇంటింటికీ సరఫరా అయ్యేందుకు నల్లా కనెక్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు జయచంద్ర, మండల కార్యదర్శి ఈశ్వర్, సోమన్న, అబ్దుల్లా, ఖదీర్ పాల్గొన్నారు.

ఓపెన్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో 'మాగీ' విద్యార్థుల సత్తా



జవహర్‌నగర్: ఈ నెల 5వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన 17వ ఓపెన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన మాగీ హైస్కూల్ విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. మాగీ హైస్కూల్ విద్యార్థులు అండర్–18లో కొత్తపల్లి సృజన, అండర్–14లో వేముల షమ్ములు బంగారు పతకాలు సాధించారు. సీనియర్‌లో బోరడి తిరుమలలు గోల్డ్ మెడల్ సాధించగా కేతావత్ రాజేష్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం, కోచ్ తిరుమల విద్యార్థులను అభినందించారు.

అంకుషాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో దివంగత జర్నలిస్ట్ నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం ముచుకుంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి హాజరై మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, శ్రీశైలం, జీవన్‌రెడ్డి, వెంకటేశ్, గణేశ్, గోపాల్‌రెడ్డి, ముచుకుంద, ప్రియాంక, శివ, రమేశ్‌ముదిరాజ్, నరసింహచారి, శంకర్ స్థానికులు పాల్గొన్నారు.

మహిళ మెడలో మంగళసూత్రం చోరీ

కీసర: రహదారిపై ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల మంగళసూత్రం లాక్కెళ్లిన సంఘటన ఆదివారం కీసరలో చోటు చేసుకుంది. సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కీసర గ్రామానికి చెందిన మెట్టు లక్ష్మమ్మ స్థానిక సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న స్వీట్‌హౌస్‌లో పని చేసేది. ఆదివారం సాయంత్రం ఆమె టీ తీసుకుని వెళుతుండగా వెనకనుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి మంగళసూత్రం లాక్కెళ్లారు. దీనిపై సమాచారం అందడంతో ఎస్.ఐ వెంకటేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దుండగుల్లో ఒకరు తలకు హెల్మెట్ పెట్టుకోగా మరొకరు మాస్క్ ధరించి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలి



మాట్లాడుతున్న బిట్స్ పిలాని సీనియర్ ప్రొఫెసర్ యోగేశ్వరి తదితరులు

కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నిర్వహించిన వృత్తిపరమైన ఎంపిక అవగాహన కార్యక్రమానికి బిట్స్ పిలాని సీనియర్ ప్రొఫెసర్ అండ్ డీన్ అడ్మినిస్ట్రేషన్ యోగేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త ఆవిష్కరణలు చేపట్టేందుకు ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కేవలం సలహాదారులుగా మాత్రమే ఉండాలని సూచించారు. మహేంద్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక విద్యతో పాటు న్యాయవాద వృత్తికి గల అవకాశాల గురించి తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ సుచరితరాయ్, ప్రమోటర్ శ్యామ్ జోయిస్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వడదెబ్బకు చెక్!

- వృద్ధులు, పిల్లలు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలి
- బాధితులకు తక్షణమే ప్రథమ చికిత్స అందించాలి
- ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాలి
- ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

సాక్షి ఇంటర్వ్యూ



ప్రొఫెసర్ డాక్టర్ కె.శంకర్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్

నల్లకుంట: వేసవి ప్రారంభంలోనే భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. రోజురోజుకూ ఎండలు ముదిరిపోతున్నాయి. ఎండ తీవ్రత కారణంగా ఉదయం 9 గంటలకే పిల్లలు, పెద్దలు బయట తిరగాలంటే జంకుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ తెలిపారు. వేసవిలో ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై డాక్టర్ శంకర్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ.

ప్రశ్న: వడదెబ్బ తగలడానికి కారణాలు ఏమిటి?

జవాబు: ఎండ తీవ్రత కారణంగా శరీరంలోని తేమ శాతం తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీని ప్రభావం మెదడుపై పడుతుంది. మెదడులో వేడిని నియంత్రించే సాధనం వేడికి గురవుతుంది. దీన్నే వడదెబ్బ అంటారు.

ప్రశ్న: నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: రోజుకు 5 నుంచి 6 లీటర్ల నీళ్లు తాగాలి. బయటకు వెళ్లే సమయంలో నీళ్ల బాటిల్ తీసుకెళ్లడం మంచిది. తలపై టోపీ ధరించాలి.

ప్రశ్న: లక్షణాలు ఎలా ఉంటాయి?

జవాబు: వడదెబ్బ తగిలిన వెంటనే నాలుక తడి ఆరిపోతుంది. శరీరంలోని ఉష్ణోగ్రతల్లో తేడాలు ఏర్పడతాయి. విరేచనాలు, వాంతులు ప్రారంభమవుతాయి. ఈ లక్షణాలు వచ్చిన వెంటనే అది వడదెబ్బ అని గుర్తించాలి. వడదెబ్బకు గురైన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స అందించి, ఆస్పత్రికి తరలించాలి.

ప్రశ్న: వడదెబ్బ సోకిన వ్యక్తిలో మార్పులు ఎలా ఉంటాయి?

జవాబు: వాతావరణంలో వేడి కారణంగా శరీరంలో ఉన్న లవణాలు, సోడియం, క్లోరైడ్ శాతం తగ్గిపోతాయి. డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాల్లో చాలా సమయం పనులు చేస్తే ఇలా జరుగుతుంది.

ప్రశ్న: వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఎలాంటి చికిత్సలు అందించాలి?

జవాబు: వడదెబ్బ సోకిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశంలోకి తరలించాలి. తడి బట్టతో ఒళ్లంతా తుడవాలి. మంచి నీళ్లు తాగించాలి. ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలి. అప్పుడు కొంత వరకు ఉపశమనం కలుగుతుంది.

ప్రశ్న: ఫీవర్ ఆస్పత్రిలో వడదెబ్బ చికిత్సకు అవసరమైన మందులు ఉన్నాయా?

జవాబు: ఫీవర్ ఆస్పత్రిలో వడదెబ్బ చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. ఐవీ ఫ్లూయిడ్స్ కూడా అవసరమైన మేరకు ఉన్నాయి. నార్మల్ సెలైన్ (ఎన్ఎస్), రింగర్ లాక్టేడ్ (ఆర్ఎల్) అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: అవగాహన కార్యక్రమాలు ఏమైనా నిర్వహిస్తున్నారా?

జవాబు: వడదెబ్బ బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రశ్న: పిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: చిన్న పిల్లలు వీలైనంత వరకు ఎండలో తిరగకుండా చూసుకోవాలి. అవసరమైతే కాళ్లకు చెప్పులు, తలకు టోపీ ధరించాలి. నీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లాలి. దాహం వేసిన వెంటనే మంచి నీళ్లు తాగాలి.

ప్రశ్న: కూలీలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: కూలీలు చల్లని సమయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పనులు చేయడం మంచిది. తలపాగా, పలుచని తెల్లని దుస్తులు ఉపయోగిస్తే వడదెబ్బ నుంచి రక్షించుకోవచ్చు.

ప్రశ్న: ఏ వయసు వారిపై ఎక్కువ ప్రభావం చూపుతుంది?

జవాబు: ముఖ్యంగా 60 ఏళ్లు నిండిన వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు ఎక్కువగా వడదెబ్బ సోకే వకాశం ఉంటుంది.

ప్రశ్న: ప్రజలకు మీరిచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

జవాబు: ముఖ్యంగా శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. వీటిని తీసుకోవడం ద్వారా దాహం తీరదు, ఐస్ క్రీమ్‌లు తినకుండా ఉండటం మంచిది. మసాలా, నూనె వస్తువులు తినకపోవడం శ్రేయస్కరం. ముదురు రంగు దుస్తులు వాడకపోవడం మంచిది.

తెలుగులో కాలచక్ర

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ప్రైవేటు వినోద చానెల్ జీ టీవీ ఆధ్వర్యంలోని జీ థియేటర్ సమర్పిస్తున్న మరాఠీ టెలిప్లే కాలచక్ర తెలుగులో అందుబాటులోకి వచ్చింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఈ కాలచక్రలో ప్రముఖ నటి గుల్కి జోషి (ఫిర్ సుబహ్ హోగి, మేడమ్ సర్..ఫేం) నటిస్తున్నారని, అత్తమామలపై క్రూరత్వాన్ని ప్రదర్శించే కోడలిగా ఆమె తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇషాన్ త్రివేది చిత్రీకరించిన కాలచక్రలో ఏప్రిల్ 14న ఎయిర్టెల్ స్పాట్‌లైట్, డిష్ టీవీ రంగ్‌మంచ్ యాక్టివ్, డి2హెచ్ రంగ్‌మంచ్ యాక్టివ్‌లో చూడొచ్చన్నారు.

సీఎంను కలిసిన రాఘవేందర్‌గౌడ్



మేడ్చల్: సీఎం రేవంత్‌రెడ్డిని మేడ్చల్ పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేందర్‌గౌడ్ కలిశారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న ఆయన గత నెలలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ నాయకులతో కలిసి ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.

ఈపీఎల్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో ఎదులాబాద్ ప్రీమియం లీగ్(ఈపీఎల్) గ్రేస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ రవితో కలిసి టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికి తీయడానికి టోర్నీ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ఉదయ్‌రెడ్డి, నరేందర్‌ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ రవి, మహేశ్‌ముదిరాజ్, శ్రీనివాస్, శేఖర్, యుగేందర్‌గౌడ్, అమర్ పాల్గొన్నారు.

నీటి సమస్యలపై ఫిర్యాదు చేయండి

కీసర: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్, మానిటర్ సెల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు నీటి సరఫరాలో అంతరాయం కలిగితే ఫోన్: 91540 75624లో సంప్రదించాలన్నారు. వార్డు ఆఫీసర్ సంగయ్య సమస్యను పరిష్కరిస్తారన్నారు.

మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

కీసర: మల్కాజ్‌గిరి పార్లమెంట్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని, అందరికీ అందుబాటులో ఉండే రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కీసరలో జరిగిన ఉప్పల్ నియోజకవర్గంలోని పలు డివిజన్ల ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకొని మల్కాజ్‌గిరి ఎంపీ స్థానాన్ని కేసీఆర్, కేటీఆర్‌లకు గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. బూత్‌స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేద్దామన్నారు. ఎన్నికల్లో సోషల్ మీడియా విస్తృతంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత మాటలు, వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి, నాయకులు సాయిజెన్ శేఖర్, కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎంఆర్‌సెట్ కళాశాల వార్షికోత్సవం

నందడి చేసిన సినీ నటులు



సీఎంఆర్‌సెట్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న హీరో సుహాస్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. కార్పీడియం 2కే24 పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, కల్చరల్ హెడ్ రోహిణిరెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడి చేసిన సినీ నటులు..

సీఎంఆర్ సెట్ కళాశాల వార్షికోత్సవంలో ప్రసన్న వదనం మూవీ టీం, పొట్టేల్ మూవీ టీంలు పాల్గొని సందడి చేశారు. ప్రసన్నవదనం హీరో సుహాస్, హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్, దర్శకుడు అర్జున్, ప్రొడ్యూసర్లు జెఎస్ మణికంఠ, ప్రసాద్‌రెడ్డి పాల్గొని తమ చిత్ర వివరాలను వివరించి ఆదరించాలని కోరారు. పొట్టేల్ మూవీ హీరో యువ చంద్రకృష్ణ, డైరెక్టర్ సాహిత్ మోత్కూరి, సినీ గాయకుడు నోయల్ పాల్గొని మూవీని సక్సెస్ చేయాలని కోరారు.

అవినీతి పరులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

చౌదరిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



చౌదరిగూడలో మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్, భోజిరెడ్డి

ఘట్‌కేసర్: అవినీతి పరులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని వారితో పార్టీ ప్రతిష్ఠ దిగజారుతుందని చౌదరిగూడ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. చౌదరిగూడలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన భూకబ్జాదారులు, 20 ఏళ్లు అరాచక పాలన చేసిన వారు, పార్కు భూములు కబ్జా చేసిన వారు తమ తప్పులు కప్పి పుచ్చుకొనేందుకు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి శవయాత్ర నిర్వహించి చెప్పులతో కొట్టిన వారు, ఫ్లెక్సీలు చింపిన వారిపై పార్టీ ఆధ్వర్యంలో పోరటం చేశామని, ప్రస్తుతం తమకు సమాచారం లేకుండా చేరికల కమిటీ సభ్యులు ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. మాజీ వార్డు సభ్యుడు భోజిరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు విలువ ఇవ్వకుండా కేసులు పెట్టి, హత్యాయత్నం చేసిన వారిని పార్టీలో చేర్చుకుంటే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్, నర్సింగ్‌రావుముదిరాజ్, నరసింహ, దామోదర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన గ్యాస్ ఆటో

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

జవహర్‌నగర్: గ్యాస్ ఆటో ఓ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను ఢీ కొట్టడంతో భర్త మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా మండలం జమ్మిగడ్డ న్యూ విరాట్‌నగర్‌లో నివసించే గట్టిముక్కల గణేష్‌చారి(57), భార్య ధనలక్ష్మీ కుటుంబసభ్యులతో ఉంటున్నారు. ఈ నెల 7వ తేదీన సాయంత్రం ద్విచక్ర వాహనంపై వారు బీజేఆర్‌నగర్ కాలనీ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గ్యాస్ ఆటో ట్రాలీ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో భార్యభర్తలు రోడ్డుపై పడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా తీవ్ర గాయాలు కావడంతో వారిని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించాలని నిర్ణయించారు. చికిత్స పొందుతూ గణేష్‌చారి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ధనలక్ష్మీ పరిస్థితి కూడా విషమంగానే ఉందని తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటో ట్రాలీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు శేఖర్‌చారి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

జవహర్‌నగర్: యువకుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ ముత్తుస్వామి కాలనీలో నివసించే పొట్లపల్లి పాండు, భార్య శంకుతల, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. కుమారుడు చంద్రశేఖర్(26) ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 4వ తేదీన తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళ్లగా కుమారుడు చంద్రశేఖర్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బండరాయితో బాది.. వ్యక్తి దారుణ హత్య

పాత గొడవలే కారణం



రక్తపు మడుగులో మనీష్ పాశ్వాన్

మేడ్చల్‌రూరల్: పాత గొడవల కారణంగా ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన ఆరుగురు పని కోసం ఆరు నెలల క్రితం శామీర్‌పేట్ మండలం మురహరిపల్లికి వలస వచ్చి గోపాల్ అనే ఓ కాంట్రాక్టర్ వద్ద భవన నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. లేబర్ ఖర్చులు, భోజనం కోసం కాంట్రాక్టర్ ఇచ్చే డబ్బులను మోకింద్ర పాశ్వాన్ ఖర్చు చేసుకోవడం, ఆ డబ్బుతో మద్యం తాగుతుండటంతో మనీష్ పాశ్వాన్(28) నిలదీశాడు. దీంతో ఈ విషయంలో కొంత కాలంగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదే క్రమంలో ఇటీవల మనీష్ పాశ్వాన్ మరోమారు మోకింద్రను అడగడంతో మనసులో పెట్టుకున్న అతను మనీష్ పాశ్వాన్ అడ్డు తొలగించుకోవాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగేందుకు వెళ్దామని చెప్పి మనీష్ పాశ్వాన్‌ను తుర్కపల్లికి తీసుకువెళ్లగా ఇద్దరూ కలిసి మద్యం తాగారు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకునే సమయంలో మురహరిపల్లి పరిధిలోని హనీబర్గ్ రిసార్ట్ సమీపంలోకి రాగానే మద్యం మత్తులో ఉన్న మనీష్ తలపై మోకింద్ర పాశ్వాన్ బండరాయితో కొట్టాడు. దీంతో అతడు కిందపడగా చనిపోయాడో లేదో అని మరోమారు బండరాయితో తలపై బాది మరణించినట్లు నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు ఘటన స్థలికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ ఘటన స్థలిని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.